క్లుప్తంగా

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



ఫరీద్‌పూర్ సొసైటీ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న డీఏఓ విల్సెంట్ వినయ్

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్‌తో పాటు ఫరీద్‌పూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను డీఏఓ విల్సెంట్ వినయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు విక్రయించే ముందు ప్రతీ రైతు కొనుగోలు చేసిన ఎరువుల బస్తా వివరాలను నమోదు చేసి, అప్‌డేట్ చేయాలని ఆయన దుకాణ యజమానులను ఆదేశించారు. డీఏఓ వెంట ఫరీద్‌పూర్ సొసైటీ చైర్మన్ బ్రహ్మం, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా రవీందర్‌గుప్తా



తూప్రాన్: మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా తూప్రాన్ పట్టణానికి చెందిన పల్లెర్ల రవీందర్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ హాజరూ, రవీందర్ గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రవీందర్‌గుప్తా మాట్లాడుతూ.. ఆర్య వైశ్యుల అభ్యున్నతికి జిల్లా మహాసభ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య మహాసభ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయం తలుపులు ధ్వంసం



రేణుక ఎల్లమ్మ ఆలయంలో ధ్వంసం చేసిన ప్రధాన ద్వారం తలుపులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని గౌడసంఘం రేణుకాఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారం ధ్వంసం చేసి చోరీకి యత్నించారు. గౌడసంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం పూజలు చేసి మధ్యాహ్నం అన్నదానం చేశారు. రోజూమాదిరిగా ఆలయానికి రాత్రి తాళం వేసి వచ్చారు. బుధవారం ఉదయం వెళ్లగా ప్రధాన ద్వారం తలుపులు ధ్వంసం చేసి ఉన్నాయి. కాగా ఆలయంలో ఎలాంటి విలువైన వస్తువులు లేకపోవడంతో చోరీ జరగలేదన్నారు. దీంతో ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించారు. గతంలో సైతం రెండుసార్లు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి హుండీని ఎత్తుకు వెళ్లారు.

మసక చీకట్లో ఇసుక దోపిడీ



ఎంకెపల్లి శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపు

పాపన్నపేట(మెదక్): చీకటి పడిందంటే చాలు ఇసుక దోపిడీ మొదలవుతుంది. పంట పొలాలకు ప్రాణం పోసే మంజీరా జలాలను జల్లెడ పట్టి ఇసుక తరలిస్తున్నారు. నెల రోజులుగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నా.. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని ఎంకెపల్లి, గాజులగూడెం, కొడుపాక శివారులోని మంజీరా నదిలో నిత్యం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఇందుకోసం కొంత మంది గ్యాంగ్‌గా ఏర్పడి, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు తీసుకొని మంజీరా నదిలో ఇసుక దోపిడికి పాల్పడుతున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4 నుంచి రూ.7 వేల వరకు అమ్ముకుంటున్నారు. ఈ ఇసుకాసురుల దోపిడి చర్యలతో ఇప్పటికే గాజులగూడెం ఎత్తిపోతల పథకం ఉత్తిదయ్యింది. తమ అక్రమ ఇసుక భాగోతం సజావుగా సాగడానికి అధికారులకు మామూళ్లు ఇచ్చి సంతృప్తి పరుస్తున్నారనే విమర్శలున్నాయి.

ఇసుక ట్రిప్పర్ సీజ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ శివారులోని హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ సదాత్‌మియా తెలిపారు. వీఆర్‌ఏ రమేశ్ సమాచారంతో సిబ్బంది హల్దీవాగు పరిసరాల్లో తనిఖీ చేస్తుండగా వెల్దుర్తి–మెల్లూర్ ప్రధాన రహదారిపై ఇసుక లోడ్‌తో టిప్పర్ గుర్తించామన్నారు. ఘటనపై వాహన డ్రైవర్‌తో పాటు యజమాని, లీజుకు తీసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పామాయిల్ సాగుతో లాభాలు

నర్సాపూర్ ప్రాజెక్టు మేనేజర్‌కృష్ణ, ఇన్‌చార్జి అజయ్



పామాయిల్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్ రూరల్: పామాయిల్ సాగుతో మంచి లాభాలు సాధించొచ్చని జిల్లా లీవ్ ఫామ్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ, ఆర్టికల్చర్ డివిజన్ ఇన్‌చార్జి అజయ్ రైతులకు సూచించారు. బుధవారం నర్సాపూర్ డివిజన్ పరిధిలోని మండలంలోని కాగజ్ మద్దూర్, పెద్దమ్మ తండా, మూసాపేట, నారాయణపూర్, శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్లతో పాటు పలు గ్రామాల్లో సాగుచేస్తున్న పామాయిల్ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 2వేల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలన్న లక్ష్యం ఉండగా, ప్రస్తుతం 9 వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారన్నారు. రైతులు ముందుకొచ్చి పామాయిల్ సాగు చేసుకోవాలని కోరారు. ఎకరా వరి పంట సాగుకు అయ్యే నీటి ఖర్చుతో 4 ఎకరాల పామాయిల్ పంట సాగు చేయవచ్చున్నారు. పామాయిల్ పంటలో అంతర్ పంటగా వరి, చెరుకు బదులుగా ఇతర ఏ పంటలైన సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. పామాయిల్ సాగు చేసుకునే రైతులకు ఎకరాకు ప్రభుత్వం రూ. 4200 పెట్టుబడి సాయంగా రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. పామాయిల్ పంట సాగును 35 నుంచి 45 ఏళ్ల వరకు ప్రాజెక్టు ప్రతినిధులు తరచూ సందర్శిస్తూ మెలుకులను సూచిస్తారని వివరించారు. రైతులు వరికి బదులు మంచి లాభాలు వచ్చే పామాయిల్ సాగు చేసి ప్రభుత్వం అందించే రాయితీని అందిపుచ్చుకోవాలని సూచించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని మండలాధ్యక్షుడు రాకేశ్ అన్నారు. బుధవారం బీజేపీ మండల నాయకులు, బూత్ అధ్యక్షులతో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థులు గెలుపుకోసం కృషి చేయాలన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాజు కోరారు. మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాడ్యూయేట్స్ ఎమ్మెల్సీతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలిపించాలన్నారు. ఈ నెల 27 జరిగే పోలింగ్ వరకు బీజేపీ ముఖ్య కార్యకర్తలు ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం అభ్యర్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మల్లారెడ్డి, సురేశ్‌గౌడ్, ఆశోక్, శంకర్, పట్టణాధ్యక్షుడు ఆకుల రాజు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి పంచాయతీ కార్మికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ కాళ్లకల్‌లో నాలుగు నెలలు, ఇతర పంచాయతీల్లో రెండు నెలల చొప్పున పెండింగ్ వేతనాలు రాక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పంచాయతీ కార్మికులకు ప్రతీనెల 1న వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పూర్ణస్వామి, అంజయ్య, బాలమణి, పుష్ప, ఇంద్ర, కృష్ణ, నర్సింలు, శోభ, బాలమణి, మైసమ్మ మహేశ్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్‌ఐ

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, వారి మాయమాటలను నమ్మి ఖాతాలో ఉన్న డబ్బులు పోగొట్టుకోవద్దని ఎస్‌ఐ నర్సింలు అన్నారు. బుధవారం ఆయన, సిబ్బందితో కలసి మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. బ్యాంకు సిబ్బంది నుంచి ఇలాంటి ఫోన్‌కాల్స్ రావన్నారు. మొబైల్ ఫోన్లలో వచ్చే అనవసర లింక్‌పై క్లిక్ చేసి, ఖాతాలో డబ్బులు పోగొట్టుకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930 కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపరిపాలన



పెద్దశంకరంపేట(మెదక్): బాలికల ప్రాథమిక పాఠశాలలో..



హవేళిఘణాపూర్(మెదక్): ఉపాధ్యాయులతో విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారిటి పాఠాలు చెప్పారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం చంద్రప్రకాష్, ఉపాధ్యాయులు రామకృష్ణాగౌడ్, సంతోష్, స్వప్న, శ్రీవాణి తదితరులు పర్యవేక్షించారు.

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని వాడి గ్రామ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీరోడ్లు, గ్రామపంచాయతీ భవనాలకు రూ. 1.19కోట్లు మంజూరయ్యాయి. దీంతో పలు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. మండలంలోని కన్నారం, మర్రిచెట్టుతండా పంచాయతీ భవనాల కోసం రూ. 20లక్షల చొప్పున మంజూరయ్యాయి. దీంతో నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. కన్నారంలో రాక్‌గార్డెన్ వద్ద పంచాయతీ భవనం నిర్మించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో పాటు మండలంలోని నాగ్సాన్‌పల్లి, మహ్మద్‌నగర్, ముద్రాజ్‌పల్లి, వెంకటాపూర్(ఆర్), లింగంపల్లితండా, కొట్టాల, వెల్మకన్న, దేవులపల్లి, సలాబత్‌పూర్, మాన్‌సింగ్‌తండా, కూకుట్లపల్లి, తిమ్మాపూర్, తునికి, కౌడిపల్లి, సదాశివపల్లి, కంచన్‌పల్లి, రాయిలాపూర్, బూరుగడ్డ గ్రామాలకు సీసీరోడ్లకు నిధులు మంజూరయ్యాయి.

15 నుంచి బ్రాహ్మణపల్లి క్రికెట్ టోర్నమెంట్

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఈనెల 15 నుంచి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుధీర్ కుమార్‌గౌడ్, రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ టెన్నిస్ బాల్‌తో ఉంటుందని ఆసక్తి ఉన్న టీం సభ్యులు రూ. 3000 ఎంట్రీ ఫీ చెల్లించి, నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9666559838 నంబర్ ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి

పాపన్నపేట(మెదక్): సెల్ ఫోన్‌లు పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న ఏడుగురికి, వాటిని తిరిగి అప్పగించామని చెప్పారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు చాలా ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, ప్రవీణ్, కిషన్ ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వెల్దుర్తి(తూప్రాన్): విధి నిర్వహణలో భాగంగా వాహనాల తనిఖీ చేపడుతున్న పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ సదాత్‌మియా అన్నారు. మండలంలోని ఆరెగూడెం శివారులో బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో వెల్దుర్తి నుంచి ఆరెగూడెం వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి వాహన పత్రాలు అడుగగా వెనక కూర్చున్న ఆరెగూడెంకు చెందిన జగన్ అనే వ్యక్తి కానిస్టేబుల్ సత్యనారాయణతో అసభ్యంగా తిడుతూ కాలర్ పట్టుకొని దూరంగా నెట్టి వేశాడన్నారు. ఘటనపై కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

డిజిటల్ తరగతులతో సృజనాత్మకత మెరుగు



చిలప్‌చెడ్‌లో డిజిటల్ తరగతులపై అవగాహన కల్పిస్తున్న డిజిటల్ లెర్నింగ్ శిక్షకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): డిజిటల్ తరగతులతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఎంఈఓ విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రం చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో మండలంలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ (ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) కార్యక్రమంలో భాగంగా డిజిటల్ తరగతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిజిటల్ లెర్నింగ్ శిక్షకులు నవీన్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో మెరుగైన బోధన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐఎఫ్‌పీ ఆపరేటింగ్, వాటిని వినియోగించే విధానాన్ని ఉపాధ్యాయులకు తెలియజేశామన్నారు. సాంకేతిక పరి/జ్ఞానం లేని వారు సైతం ఈ ప్యానెల్‌ను సులభంగా వినియోగించుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఈ విధానంతో పాఠ్యాంశాలు వినడం, చూడడంతో విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్ హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయులు సోమకృష్ణ, అజయ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించండి



శిక్షణ ఇస్తున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. బుధవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మండలంలోని స్కూల్ అసిస్టెంట్లకు ఐఎఫ్‌పీ (ఇంటలెక్చువల్ ప్లాట్ ప్యానల్స్)పై గణితం, ఫిజిక్స్, బయోసైన్స్, సాంఘీకశాస్త్రంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం టీవీలు ఇచ్చిందని, విద్యార్థులకు టీవీ ద్వారా విద్యబోధన చేసేందుకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా ఆయా సబ్జెక్టులపై రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు.

విద్యార్థుల వనభోజనం



వన భోజనం చేస్తున్న విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): రోజు మధ్యాహ్న భోజన మేనా..! ఈరోజు వన భోజనం చేద్దామంటూ అనుకున్నారు. అనుకున్నదే తడవుగా బుధవారం చిన్నారులంతా ఇంటి నుంచి తెచ్చుకున్న రకరకాల ఆహార పదార్థాలను పంచుకున్నారు. మండలంలోని గాజులగూడెం ప్రాథమిక పాఠశాలలో 61 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి రోజు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినేవీరు.. ఒక రోజు వినూత్నంగా గడపాలని అనుకున్నారు. అన్నం, కూర బడిదే అయినా.. ఇతర తిను బండారాలు, పిండి వంటలు తమస్థాయిని బట్టి ఇంటి నుంచి తెచ్చుకున్నారు. బడి తోటను.. వన వేదికగా మార్చారు. అందరూ కలిసి వంటకాలను పంచుకొని ఆనందంగా గడిపారు. హెచ్‌ఎం సాయిసిరి మాట్లాడుతూ.. సామాజిక సమానత్వం విరాజిల్లుతుందన్న ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. టీచర్లు సైతం ఇంటి నుంచి వంటకాలను తెచ్చి విద్యార్థులతో పంచుకున్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం భక్తజనం పోటెత్తారు. అమ్మవారి ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనము, హరిద్వార్చన, విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ భక్తులకు అన్నదానం నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఆటో, ఇల్లు దగ్ధం



కాళ్లకల్‌లో దగ్ధమైన ఆటో

మనోహరాబాద్(తూప్రాన్): షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధమైన సంఘటన మండలంలోని కాళ్లకల్‌లో శివారులో జాతీయ రహదారి–44పై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన నాందేవ్ సురారం నుంచి కిరాయిపై కామారెడ్డికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని కాళ్లకల్ శివారులోకి రాగానే ఆటోలోంచి మంటలు రావడంతో ఆటోను రోడ్డు పక్కన నిలిపివేశాడు. కాగా ఆటో ఇంజన్, క్యాబిన్ మొత్తం ప్రమాదంలో దగ్ధమైంది. అలాగే షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కాళ్లకల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో పెంకుటిల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు రూ.35 వేలు సైతం దగ్ధమైన్నట్లు తెలిపారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉంటేనే విజయం



నూతన కమిటీతో జిల్లా అధ్యక్షుడు జయరాములు

శివ్వంపేట(నర్సాపూర్): పద్మశాలీలు ఐక్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో విజయం సాధిస్తామని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు జయరాములు అన్నారు. బుధవారం మండలంలోని దొంతిలో పద్మశాలి నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా జయరాములు మాట్లాడుతూ.. పద్మశాలీలను ఏకతాటిగా ఉండేందుకు గ్రామస్థాయి కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో పద్మశాలీలు తమ సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. దొంతి గ్రామ శాఖ అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా రాజు, సుమన్, ప్రధాన కార్యదర్శిగా కాంతం, సహాయ కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా వెంకటేశంతో పాటు మహిళా, యువజన విభాగం కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు నర్సింలు, మండలాధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి వీరేశం తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఫర్నిచర్ అందజేత

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని పల్లెదవాఖానా కోసం బుధవారం నాయకుడు పరంజ్యోతి ఫర్నిచర్ ను అందించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ.. పల్లె దవాఖానాలో ఫర్నిచర్ కొరత ఉందని స్థానికులు కోరడంతో తనవంతు సాయంగా కుర్చీలతో పాటు ఫ్యాన్‌ను అందింస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి, నాయకులు రఘుపతి, లక్ష్మణ్, మల్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సుగుణ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

◆ డంప్‌యార్డును ఎత్తివేయాలి

నర్సాపూర్: గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన డంప్‌యార్డును ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్యారానగర్‌లో డంప్‌యార్డు ఏర్పాటు చేస్తే ఆ గ్రామం పక్కనే ఉన్న కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల్లో రైతుల సాగు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. డంప్‌యార్డుతో నర్సాపూర్ అటవి ప్రాంతం కలుషితమవుతుందని, అడవి నుంచి వచ్చే కలుషిత నీరు నర్సాపూర్ రాయరావు చెరువులోకి రావడంతో చెరువు కలుషితమవుతుందని నాగరాజు చెప్పారు. ప్యారానగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలపై దుష్ప్రభావం చూపే డంప్‌యార్డును అక్కడి నుంచి ఎత్తివేయాలని అన్నారు. ఆయన వెంట సీఐటీయూ నాయకులు మల్లేశం, సురేశ్ తదితరులు ఉన్నారు.

◆ శివ పార్వతుల కల్యాణోత్సవం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని పురాతన హరిహర మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివ్వంపేట వాస్తవులు శివమాలధారణ గురుస్వామి గణేశ్‌గౌడ్, శివ భక్తుడు రాజు లోక కల్యాణార్థం నిర్వహించిన కల్యాణోత్సవాన్ని అర్చకుడు చందు నిర్వహించారు. అనంతరం గురుస్వామి వీరప్ప ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవం కనుల పండువగా చేశారు.

◆ ఘనంగా బండ్ల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి, కౌడిపల్లిలో మల్లన్న జాతరలో భాగంగా బుధవారం బండ్లు, బోనాలను ఘనంగా ఊరేగించారు. కంచన్‌పల్లిలో గౌడసంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు బండ్లు, ట్రాక్టర్లను ఊరేగించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎల్లమ్మకు భక్తులు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

◆ సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలు

రామాయంపేట(మెదక్): సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో బుధవారం మహంకాళి ఆలయం వద్ద సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సమతా మూర్తుల క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు పెంటయ్య, వేదిక జిల్లా కార్యదర్శి నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

◆ రంగంపేట నూతన కార్యదర్శిగా రాజు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామపంచాయతీ నూతన కార్యదర్శి రాజు బుధవారం పదవి బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ప్రియాంక బదిలీపై వెళ్లారు.

◆ అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాలు

తూప్రాన్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం 21వ వార్షికోత్సవాలను భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్మశాస్త అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో జరిపారు. అలాగే ఆలయంలోని దేవత మూర్తులకు అభిషేకం, స్వామివారికి పడిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సంకీర్తనలు ఆలపించారు. వేడుకల్లో శ్రీనివాస్‌గౌడ్, రుపేశ్, కిష్టారెడ్డి, సత్యనారాయణగౌడ్, కృష్ణ, అనిల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని అక్కన్నపేటకు చెందిన ఉపాధ్యాయుడు సలావుద్దీన్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. మాజీ ఎంపీపీ భిక్షపతి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

◆ దూడ మృతి

రామాయంపేట(మెదక్): పట్టణ శివారులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో దూడ మృతి చెందింది. దళితవాడకు చెందిన రైతు బైరం శ్రీనివాస్ తన పశువులను వ్యవసాయ బోరువద్ద కట్టేశాడు. ఉదయం వెళ్లి చూడగా దూడ మృతి చెందింది. ఈవిషయమై బాధిత రైతు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బీట్ అధికారి లక్ష్మణ్ సంఘటనా స్థలాన్ని సందర్శించాడు.